# నిత్యవిషాదం

ఎన్నడూలేనిది పార్వతి అర్ధాంతరంగా కృష్ణమూర్తిని దంత వైద్యుడి దగ్గిరికి వెళ్ళనిచ్చి ఫోను చేసింది.

"ఏంకథ, నేనో గంటలో వచ్చేస్తున్నా." అన్నాడు కృష్ణమూర్తి.

"అలాకాదు కృష్ణా, ఇది చాలా అర్జెంటు. నాకోసం అక్కడే ఉండు" అంది—జాలిగా.

"ఏమిటీ? యీ దంతవైద్యుని కుర్చీలోనా?" ఆశ్చర్యంగా అడిగాడు కృష్ణ.

అవతల నుంచి నవ్విన పార్వతి టక్కున పెట్టేసింది ఫోను. దంత వైద్యుడు రావుగారు కృష్ణమూర్తిని చూసి ముసి ముసి నవ్వులు నవ్వుతూ "ఏమిటా అర్జెన్సీ?" అన్నట్టు చూశాడు.

"గాడ్ ఓన్లీ నోస్ సార్" అన్నాడు నిరుత్సాహంగా కుర్చీలో చేరబడుతూ.

ఇంక మాటలతో పని లేదన్నట్టు కృష్ణమూర్తి నోటికి క్లాంపు వేశారు!

కృష్ణమూర్తి డాక్టరుగారి కుర్చీ వదలకుండానే పార్వతి

వచ్చేసింది. వస్తూనే మర్యాదగా తలుపుమీద తట్టి లోపలికి వచ్చింది.

నిస్సహాయింగా కుర్చీలో చేరబడి కూర్చుని ఉన్నాడు కృష్ణమూర్తి. ఏమిటి విశేషం అన్నట్టు భార్యని కళ్ళతోనే పలకరించాడు.

"ఇంకా చాలా సేపే పడుతుందమ్మాయి. నువ్వో కుర్చీ లాక్కుని పక్కనే కూర్చో - మీ ఆయన కాల్చిన సిగరెట్ల తాలూకు తారు, పైవుల తాలూకు తారు ఓ మైన్ రోడ్డు వేయడానికి సరిపోయింది." నవ్వుతో అన్న డాక్టరు రావు గారు కసిగా ఆయుధాలు చిత్రిక పడుతున్నారు. పార్వతి పక్కనే ఉన్న మోడరన్ అల్యూమినియం కుర్చీ దగ్గరికి లాక్కుని కృష్ణమూర్తికి చెవిదగ్గిర చేరింది.

"నువ్వా యీ గేటు దాటావు ఉత్తరం వచ్చింది. దాన్ని నానిగాడి చేతుల్లోంచి పోస్టుమేన్ ఆట ఆడి ఆడి ఇప్ప టికి అందుకోకల్గాను. ఎవ్వరాశారో తెలుసా?"

"తెలియదు" తలూపాడు కృష్ణమూర్తి. భార్య యింతలా వింతగా నోరు తెరుచుకు కూర్చోడానికి ఎబ్బెట్టుగా ఉన్నా "పెళ్ళాంముందు సిగ్గేమిటి?" అని రావుగారు వేళా కోళం చేస్తారని మాట్లాడక ఊరుకున్నాడు కృష్ణమూర్తి.

"తనొస్తానని రాసింది." నెమ్మదిగా తేనె పూసిన కత్తిలా మాట సర్రున జార్చింది పార్వతి.

పక్కనే బాంబు పేలినంత అదిరిపడ్డాడు కృష్ణమూర్తి మెడ కదప డానికి లేకుండా గట్టిగా పట్టుకుంది క్లాంపు. సానుభూతిగా అతని చేయి మీద చేయి వేసి నొక్కింది పార్వతి.

"మనస్సేం బాగులేదుట. జీతం పెరిగిందిట. కాని తెలియని చింత ప్రాణం కొరుక్కు తింటూందిట్రా. అంచేత ఓ వారం రోజులు నాతో గడపాలని వస్తూంది సీత. ఈ వేళే రమ్మని టెలిగ్రాం ఇవ్వనా?"

పార్వతి ఇక్కడికే వచ్చి చెప్పాలని ఎందు కనుకుందో బోధపడింది కృష్ణమూర్తి. కట్టి పడేసిన ప్రేక్షకుడిలా చెప్పింది విని తలాడించక తప్పదు. సరే నీ యిష్టం అన్నట్టు పార్వతి చేయి తట్టాడు.

అటూ ఇటూ చూసి రావుగారు పక్కకి వెళ్ళనిచ్చి కృష్ణమూర్తి చెంప మీద సుతారంగా ముద్దెట్టుకుంది పార్వతి.

"నువ్వు వద్దనవని నాకు తెలుసనుకో. నూకాల్ని కాపలా పెట్టి వచ్చాను." వచ్చినంత త్వరగానూ లేది వెళ్ళి పోయింది పార్వతి.

పళ్ళు కటకట కొరకాలని పించింది కృష్ణమూర్తికి. ఈ సీతంటే ఏమిటి? అమాయికమైన పెద్దకళ్ళు అందమైన విగ్రహం. జాలి చూపులతో ఎలాంటి శిలనైనా కరిగించే చిరునవ్వూ కాదు! అబ్బే అవి మాత్రమే అయితే, "బావగారూ" అంటూ తన వెంట తిరిగితే ఎంతేనా గర్వించే వాడే. కాని సీత అగ్ని పర్వతం. సీత సీత నగం. ఊపిరాడ నివ్వదు. వచ్చి నప్పుడల్లా ఏదో విషాద గాథని గుండెల్లో నింపుకుని కళ్ళ చుట్టూ నల్లని వలయాలతో, దిగాలు పడిన ముఖంతో వస్తుంది. వచ్చిన అర్థ పూటలో ఇంట్లో వాతావరణం అంతా మారి పోతుంది. రోజుల తరబడి ముసురు పట్టినట్లు ఇంట్లో

విషాద వాతావరణం అలుము కుంటుంది. ఎవరూ గట్టిగా మాట్లాడ కూడదు. నవ్వుకో కూడదు. అటువంటప్పుడే నానిగాడు మోకాలికి దెబ్బ తగుల్చుకుంటాడు. బాబిగాడు మెట్ల మీదనుంచి దొర్లి మెడ బెణుకట్టించుకుని ఎవరు పిలి చినా గాలి కోడిలా చుట్టూ తిరిగి పలుకుతాడు, అందరూ ఏ క్షణంలో ఏ మాటుందా అన్న నిరీక్షణలో ఉన్నట్టే ఉంటారు. రామ రామ! సీత సంగతి చెప్పనే అక్కర్లేదు. ఇంట్లో పార్వతికి నీడలా తిరుగుతూ, విషాదకరం అయిన సూక్తులు వల్లె వేస్తూ వుంటుంది. ఎవరూ ఎదురు చూడని సమయంలో గుడ్లు నీరు కుక్కుకుని అన్నం ముందు నుంచి అవతలకి పరి గెడుతుంది-అందరూ తెల్లపోయి చూసేలా. ఓ నాలుగైదు రోజుల్లో ఉత్తరమో, మనిషో ఎదురు చూసిన ఫోనో వస్తే సరేసరి లేకుంటే - అతి పరిశ్రమ మీద గుండె నిబ్బరం పుంజుకుని ఉత్సాహం తెచ్చుకుని తిరగాలని నిశ్చయించు కుంటుంది సీత. "జీవితం సాగాలి కదా!" అంటుంది- పెద్ద వేదాంతిలా,. లాంటి సీత వస్తుందంటే - కృష్ణమూర్తి దడుసుకోవడంలో ఆశ్చర్యం ఏముంది. సీత వస్తుందన్నప్పుడు, తనేమైనా అనుకుంటాడేమోనని పార్వతి పడే అవస్త చూసి జాలి వేస్తుంది కృష్ణమూర్తికి.

డాక్టర్ గారి కుర్చీలోంచి లేచి ఇంటికి వచ్చేదాకా అదే ఆలోచించాడు కృష్ణమూర్తి.

ఇంట్లో అడుగు పెడుతూనే భార్యని దగ్గిరికి తీసుకుని "పార్వతీ ఎలాగా నీ స్నేహితురాలు వారం రోజులుంటుంది కదా? నువ్వూ నేనూ అలా పాండిచేరి చూసి వద్దాం. ఎలా ఉంది అయిడియా?" ఉత్సాహంగా అడిగాడు.

"అది పుట్టేడు దుఃఖం వెళ్ళపోసుకుని నా దగ్గర కష్టం సుఖం చెప్పుకోవాలని వస్తూంది. నే ఎలా రాను?" దీనంగా ముఖం పెట్టింది పార్వతి.

వంగి భార్య పెదవులని తృప్తిగా ముద్దు పెట్టుకున్నాడు కృష్ణమూర్తి.

"పోనిలే, ఆ వారం నాకు ఒంట్లో బాగుండదుట నిన్నే నర్సుగా నా సిక్ రూమ్‌లో ఉంచేలా చూడు?" కొంటెగా చూస్తూ నానిగాడి రాక తెలిసి భార్యకి దూరంగా జరిగాడు.

"ఏం డాడీ అమ్మకేమైంది?" ఆత్రంగా అడిగాడు నాని.

"ఏం లేదోయ్. సీతా ఆంటీ వస్తూంది." వార్త సూటిగా చెప్పాడు కృష్ణమూర్తి.

"నిజంగానా?" దిగాలు పడి అడిగాడు నానిగాడు,

"ఎస్. ఒంట్లో బాగలేకపోతే ఆంటీ లంతా మమ్మి దగ్గరకు వస్తూంటారు. కాని దీన్లో కొత్తేం లేదే" ఉత్సాహంగా అన్నాడు కృష్ణమూర్తి.

"ఉషా ఆంటీ ఫరవాలేదు. కోమల ఆంటీ ఫరవాలేదు. కప్పు ఆంటీ ఓకే. ఇంకా అన్నపూర్ణ, శాంత, అంతా ఫరవా లేదు. కాని సీతా ఆంటీ..." నసిగాడు నానిగాడు.

"నోనో. నువ్వలా అనుకోకూడదు. అందరు ఆంటీలూ రకరకాలుగా ఉంటారు. సీతా ఆంటీ కేం అజంతా బొమ్మలా ఉంటుంది."

"కాని సరదాగా ఉండదు డాడీ."

"ఉంటుంది ఈ సారి చూడు—" కృష్ణమూర్తి కొడుకు తల మీద ముద్దుగా కొట్టి తన గదిలోకి దారి తీశాడు.

"ఈ మగాళ్ళంతా ఇంతే, చూడు. డాడీకి నచ్చేదు-కోడుక్కి నచ్చదు" వంటింట్లోకి నడుస్తూ స్వాగతం పలుకుతుంది పార్వతి.

రెండు రోజులు గడిచాయి. మూడో రోజు ఉదయాన్నే ఆఫీసుకి వారం రోజులు సిక్ లీవు పంపి స్టేషనుకి వచ్చాడు కృష్ణమూర్తి. ఈసారి ఎలా ఉంటుందో సీత. పోయినసారి స్వప్నసుందరిలా రైలు దిగింది. కృష్ణమూర్తికి ఓ క్షణం కళ్ళు బైర్లు కమ్మాయి. ఇంకోసారి, బిక్షురాలలాగ పెద్దగాలి వీస్తే పడిపోయే సుకుమారిలాగా తోస్తుంది. ఒకసారి పొట్టిగా ఉన్నట్టుంటుంది. ఇంకోసారి పొడుగ్గ ఉన్నట్టుంటుంది. ఈ పొట్టీ పొడుగులు కూడా ఎలా మారుస్తూంటుంది చెప్మా? అనుకునేవాడు కృష్ణమూర్తి. ఈసారి నే గుర్తు పట్ట కల్గుతానా? అనుకుంటూ రైలు ఓ పక్క నుంచి యింకో పక్కకి కొలవడం ప్రారంభించాడు. ఒక పెట్టెలోంచి "బావగారూ" అంటూ కోకిల స్వరం వినిపించింది. రైలు పెట్టె ద్వారంలో శిల్పి చెక్కిన బొమ్మలాగా నిలబడి ఉంది సీత. పెట్టెలో వారంతా దిగిపోయారు. సీత మటుకు అలా నిలబడిపోయింది. కృష్ణమూర్తి దగ్గరికి వెళ్ళి "పెట్టె బెడ్డింగూ దింపించవా" అడిగాడు.

బదులు చెప్పకుండా చేయి అందించింది సీత. అప్పుడే అర్థం అయింది — పెట్టె దిగడానికి సాయంకోసం అలా వేచి నిలబడిందని, చేయి అందుకుని సుతారంగా సీతని దింపాడు కృష్ణమూర్తి.

"ఒక్క బ్యాగే తెచ్చాను బావగారు. పై బెర్తుమీద ఉంది" అంది.

చిన్న తోలు బ్యాగు పట్టుకుని కిందికి దిగాడు కృష్ణ మూర్తి.

కృష్ణమూర్తి భుజాన్ని ఆనుకుని పాదాలు నేల నానకుండా వయ్యారంగా నడుస్తూ ఏమేమిటో చెప్తున్న సీత మాటలు చెవి కెక్కడంలేదు కృష్ణమూర్తికి. ప్లాటుఫారం మీాది జనం చూస్తున్న ధోరణి తిలకిస్తున్నాడు.

హిప్పీ హిప్పీ సారీలో సీత చూడముచ్చటగా ఉంది. నున్నగా కుప్పలా ఉన్న జుట్టు ముడి సీత ముఖాన్ని అతి అమాయికంగా తోపింప చేస్తూంది. పిస్టన్ రింగ్సులాఉన్న చెవి పోగులు గాలికి కదలాడి మిల మిల మెరుస్తున్నాయి. మోకాళ్ళ దగ్గిర టైట్ గా బిగించిన చీరతో తొడలు అతి అందంగా కదులుతున్నాయి. "ఈ అమ్మాయికా మానసి కాందోళని నాకా?" అనుకుంటూ కారు దగ్గరికి నడిపించాడు కృష్ణమూర్తి.

"పార్వతి అదృష్టవంతురాలు, మీాలాంటి భర్త అంద రికీ ఎలా దొరుకుతాడు?" అంది సీత.

కారుని ఆగమేఘాలమీాద యింటిముందు వాల్చాడు కృష్ణమూర్తి. కారు చప్పుడు విని నానిగాడు, బాబిగాడు, పార్వతి ఒక్కసారి బయటికి వచ్చారు.

"పారూ" అంటూ అమాంతం స్నేహితురాలి చేతుల్లోకి వాలిపోయి—"అస్సలు నాకర్థంకాదే"అంటూంది సీత.

"నాకు బాగానే అర్థం అవుతోంది చిట్టితల్లి" అనుకున్నాడు కృష్ణమూర్తి.

ఎలా అర్థం అయిందని విడిగా చెప్పనక్కరలేదు కృష్ణ మూర్తికి ఇటుపై వారం రోజులూ రాత్రి పక్క చేరే సమయానికి ఎవరెంత ద్రోహం తన స్నేహితురాలికి తల పెట్టారో — ప్రేమించడం నటించే యీ మగవాళ్ళెంతటి కిరాతకులో పార్వతి చెవిని ఇల్లు కట్టుకుని చెప్తుంది. విషాద సంగీతం వింటూ తలగడలో తలదూర్చి పడుకునే ఉంటుంది సీత. మాల్కోసై వప్ సాంగ్స్ అవే వినిపిస్తాయి.

మర్నాటి ఉదయం రావుగారి క్లినిక్‌కి బయలుదేరుతున్నాడు కృష్ణమూర్తి.

“సీతని తీసుకువెళ్ళు కాలక్షేపం” అంది పార్వతి చొక్కా గుండీలు సవరిస్తూ.

“కాలక్షేపమా? సాయమా!” నవ్వేశాడు కృష్ణమూర్తి. కారు దిగ్గానే కౌగిలించుకున్న స్నేహితురాలి చీరని రెండంగుళాలు బొడ్డుపైకి లాగిన పార్వతి చేష్ట గమనించక పోలేదు కృష్ణమూర్తి! “ఏం లేదు కృష్ణా, అటూ ఇటూ తిరిగితే సరదాగా ఉంటుందని, ఓ గంట సీతో తిప్పి తీసుకురా! ఈలోగా ఇంటి పనులు బోలెడు ఉండిపోయాయి- నేను మజ్జిగ పులుసు కూడా చేస్తాలే!” ఎర చూపెట్టింది పార్వతి. ఓ. కె. అన్నాడు కృష్ణమూర్తి - ఒక్క దెబ్బకి రెండు పిట్టలు-అందమైన అమ్మాయితో షికారు. కోరుకున్న మజ్జిగ పులుసు ఇంకేం కావాలి?

“ఇంకా చాలా కావాలి” అన్న సంగతి సర్జరీలో అడుగుపెట్టగానే తెలిసింది కృష్ణమూర్తికి. ప్రేమ కుర్చీలో కుదురుగా కూర్చోలేక లోపలి గదిలోకి వచ్చి సుతారంగా

టేబిలు అంచులపై ఆని కూర్చుంది సీత. చక్రాల్లాంటి కళ్ళతో డాక్టరుగారి ప్రతి కదలికనూ గమనిస్తూ, నవ్వుగా నవ్వుతూ కాలక్షేపం చేస్తూంది. పార్టీషన్ పక్కకు తొంగి చూసింది అంతే. లేచి నిలబడి చీర సర్దుకుని కృష్ణమూర్తి కుర్చీని ఆనుకుంది వయ్యారంగా "ఆ ప్రక్కనెవరు బావగారూ!" అంటూ.

"డాక్టరుగారబ్బాయి ఏం?" అన్నాడు కుతూహలంగా కృష్ణమూర్తి.

"బ్యూటిఫుల్ గా ఉన్నాడు డాక్టరేనా?"

"ఆఁ ఆ క్షణంలో గెడ్డం మొనదాకా ఉగిన సైడ్ బర్న్ లతో తలకి నెట్టుతో దంత వైద్యుని కుర్చీ చుట్టూ వాలె డాన్సరులా నడిచే రావుగారి అబ్బాయి జ్ఞాపకం వచ్చాడు కృష్ణమూర్తికి.

ఆరోజు ఓ పట్టాన సీతకి దంత వైద్యుడి గది వదిలి రావడం ఇష్టంలేక పోయింది ... ఈ సంగతే పార్వతికి రాత్రి చెప్పాడు కృష్ణమూర్తి.

పోనీ కృష్ణా ఆ అబ్బాయి డాక్టరుగా. రెండు రోజులు నీ పంటి శిక్షణ పొడిగించు" అంది గోముగా.

పెంచుకోవలసిన అవసరం లేకుండానే దంతవైద్యం పెరిగింది కృష్ణమూర్తికి. సిక్ లీవు ఖాస్తా అయిపోవచ్చే సరికి - పళ్ళ నొప్పులు మొదటికి వచ్చాయి. కృష్ణమూర్తి ప్రాణం ఉసూరుమంది.

"ఓసారి అబ్బాయి జుట్టు పేషంటుకి పెట్టిన క్లాంప్ లో చిక్కుకుంది. అందుకే రావుగారు నెట్టు పెట్టుకుంటేగాని సర్జరీలో అడుగెట్టనివ్వరు" అబ్బాయిని గురించిన వివరాల

కోసం చంపుతూంటే చెప్పాడు కృష్ణమూర్తి. అదేం భయ పెట్టినట్టు లేదు పార్వతిని.

అయినా పార్వతిని కాదని తోసిరాజనగల శక్తి కృష్ణమూర్తికి లేదు. నాలుగు రోజులు సాగేసరికి సీత పాప్ సంగీతం వినేదాకా బాగుపడింది. సీత ఉత్సాహంతో పాటు ఇంట్లో వాతావరణం రేడియోవాళ్ళు చెప్పినట్టు తడిపొడిగా తయారు అయ్యింది. కృష్ణమూర్తి రొట్టె విరిగి నేతిలో పడింది,

సీత హిప్పీహెర్ సొంపులు ఇంద్ర ధనువు సొబగులు ఈనుతున్నాయి. కృష్ణమూర్తి సాయం అక్కరలేకుండానే అటూ ఇటూ తిరుగుతూంది. నానిగాణ్ని ముద్దు చేస్తుంది. వాడిది అసలే మిలటరీ క్రాపు. దాన్ని నెత్తిలో పెట్టి చూసి ముద్దెట్టుకుంటుంది.

"నాన్నారూ వాట్ ఈజ్ రాంగ్ విత్ మమ్మీస్ ఫ్రెండ్?" అని చాలా సూటిగా అడిగాడు.

"ఎవ్విరిథింగ్" అనాలనిపించింది కృష్ణమూర్తికి. కాని కుర్రాడి దగ్గిర అలా అనకూడదు. "ఏం లేదు నానీ, సీత తికి ఒంట్లో బాగులేదు. కడుపు నొప్పి, తలనొప్పి. గుండెనొ: " నటిస్తూ చెప్పాడు- నవ్వేసి నానిగాడు వెళ్ళిపోతాడని.

"మమ్మీకి ఒంట్లో బాగుండకపోతే అలా ఉంటుంది కదా? ఈ ఆంటీ అంత డ్రస్ చేసుకుంటుందే?"

"ఆంటీకి ఇంకా పెళ్ళి కాలేదు కదూ అందుకు. పోయి హోం వర్క్ చేసుకో" అన్నాడు కృష్ణమూర్తి.

తను వేసుకున్న ప్రశ్నలకి సమాధానం దొరకని వేదాంతిలాగా పెదవి విరచి వెళ్ళిపోయాడు నానిగాడు.

ఆ రాత్రి కనీసం పదిసార్లైనా పిలిచాక గాని పడక గదిలోకి అడుగు పెట్టలేదు పార్వతి. వస్తూకూడా, కష్టపడి నవ్వుని ఆపుకొని తలుపు జేర్లవేసి, మంచంమీద కూల బడింది. పెదవులు బిగపట్టినా కళ్ళు చిరునవ్వుతో చిరు చేప ల్లాగా మెరుస్తున్నాయి.

"ఏం కథ" అన్నాడు భార్యని తనవైపు తిప్పుకుంటూ.

"మళ్ళీ మొదలెట్టొచ్చింది" నవ్వుతూ అంది పార్వతి.

"బాధపడక నవ్వుతావేం?"

"ఈసారి కారణం నువ్వు అయితే నవ్వక ఏడవనా?" భర్త ఛాతీపై వాలి పక పక నవ్వింది.

"నే నా ? రామ! రామ! నేనేం చేశానోయ్?"

"ఏమేనా చెయ్యాలా ఏం?"

"అబ్బ అసలేం జరిగిందో చెప్పు-చంపక."

"ఆ డాక్టరు కుర్రాడు అతివినయంగా యూసీ మిసెస్ కృష్ణమూర్తి" అన్నాట్ట- పగలబడి నవ్వింది పార్వతి.

"వాట్?" ఆశ్చర్యంగా అడిగాడు కృష్ణమూర్తి. నిజా నికి కేక పెట్టాడు.

"వాట్ ఏమిటి? అంత హిప్పిసారీ అమ్మాయితో ముచ్చటగా విడిపడలేనట్టు వెళ్ళగా లేంది - వాడలా అంటే ఏం పోయింది?"

"పార్వతీ, ఏంమనిషివి? నువ్వే..." ఇంక మిగిలిన మాట రాకుండ పార్వతి సుతారంగా కృష్ణమూర్తి నోరు మూసింది. నవ్వుతూ లైటు తగ్గించింది.